# డిటెక్టివ్ అప్పలకొండ

-డా.ఎమ్.సుగుణరావు



పేపరు చదువుతున్న అప్పలకొండ ఎగిరి గంతేసాడు. పక్కనే ఉన్న రాంపండు "ఏంటిరా విషయం?" అన్నాడు.

"ఏదో డిటెక్టివ్ ఏజెన్సీ వారి ప్రకటన. ప్రైవేట్ డిటెక్టివ్‌లుగా పని చేసేందుకు నాలాంటి తెలివైన యువకులు కావాలిట" అన్నాడు ఉత్సాహంగా.

"నీలాంటి యువకులా?" అన్నాడు రాంపండు, అప్పలకొండను పరిశీలనగా చూస్తూ.

"ఔనురా! నాకేం తక్కువ?" అన్నాడు. "అవును... అన్నీ ఎక్కువే" అన్నాడు రాంపండు బాగా పెరిగిన అప్పలకొండ పొట్ట చూస్తూ.

"నాలుగువందల డిటెక్టివ్ నవలలు చదివి, బోలెడు జేమ్స్‌బాండ్ సినిమాలు చూసాను. ఈపాటి అనుభవం చాలదా డిటెక్టివ్‌గా పని చేయడానికి. రేపే వైజాగ్‌లో ఇంటర్వ్యూ. నాకు తోడుగా రావాలి నువ్వు" అన్నాడు అప్పలకొండ.

"అలాగే ఇంటర్వ్యూలో నువ్వు చెప్పే జవాబులు విని ఆ ఏజెన్సీ వాళ్లు నిన్ను ఏదో ఒకటి చేయడం ఖాయం. ఆ స్థితిలో నువ్వు ఒక్కడివే రాలేవుకదా. నీకు తోడుగా తప్పక వస్తాను" అన్నాడు రాంపండు.

***

తరువాత రోజు ఇంటర్వ్యూకు బయలుదేరాడు అప్పలకొండ. అతడికి తోడుగా రాంపండూ వచ్చాడు. అరగంట తరువాత అప్పలకొండకు పిలుపొచ్చింది. లోపల గదిలో ముగ్గురు కూర్చున్నారు. "మీ పేరు?" అడిగాడు ఒకాయన.

'బాండ్ ...జేమ్స్‌బాండ్ ...' స్టైల్ లో "కొండ...అప్పలకొండ" అని చెప్పాడు.

"బాబూ! మన దేశానికి స్వాతంత్ర్యం ఎప్పుడొచ్చింది?" ఒక సభ్యుడు అడిగాడు.

"అప్పటికి నేను పుట్టలేదుకదండీ. అందువలన ఆ విషయం తెలిసే అవకాశంలేదు" అన్నాడు.

"అంత చిన్న విషయం, మనం అంతా గుర్తు పెట్టుకోవాల్సిన విషయం తెలియకపోతే ఎలా? సరిగ్గా చెప్పు" అన్నాడు ఆ సభ్యుడు చిరాగ్గా.

"బహుశా... ఆంగ్లేయులు మనదేశం వదిలి వెళ్లిపోయినప్పుడేమో?" అన్నాడు.

"పోనీలే దగ్గర దగ్గరగా వచ్చావు" అంటూ ఆ సభ్యుడు సంతోషపడ్డాడు.

రెండో సభ్యుడు "ఉత్తరం ఏది?" అన్నాడు.

ఒక కవరు తీసి ఆ సభ్యుడి చేతిలో పెట్టాడు.

"ఏంటది?" అన్నాడు ఆశ్చర్యంగా ఆ వ్యక్తి.

"మా ఊరి ఎమ్మెల్యే రికమండేషన్ లెటర్ సార్" అన్నాడు అప్పలకొండ నవ్వుతూ.

"ఓరి నీ అసాధ్యం కూలా... నీ తెలివికి జోహార్. మరి దక్షిణం" అన్నాడు ఆ సభ్యుడు నవ్వుతూ.

"ఉద్యోగం మీరు ఖాయం చేస్తే మీ ఇంటికి పట్టుకువస్తాను" అని ఆ సభ్యుడి చెవిలో రహస్యంగా చెప్పాడు అప్పలకొండ.

"బాబూ! మేము అడిగింది నువ్వు అనుకున్నట్లు ఆ ఉత్తర దక్షిణాలు కాదు, దిక్కులు చూపించమన్నాం. పోనీలే తూర్పు దిక్కు ఎటువైపు ఉంటుందో చెప్పు" అన్నాడు ఆ సభ్యుడు అసహనంగా. అప్పలకొండకు ఆ ప్రశ్నకు గుండెల్లో రాయి పడింది. దేవుడికి దణ్ణం పెట్టి కళ్లు మూసుకున్నాడు. "వెరీగుడ్! తూర్పు తిరిగి దణ్ణం పెడుతూ బాగా చూపించావు ప్రాక్టికల్‌గా" అన్నాడు ఆ సభ్యుడు.

"సరే... ఇంతవరకూ ఒక మాదిరిగా ఉంది నీ జనరల్ నాలెడ్జి. మరయితే నీకు వృత్తిపరమైన ప్రశ్న... నువ్వు ఒక దొంగల స్థావరంలోకి ప్రవేశించావు. వారి దగ్గర నుంచి ఒక రహస్య సమాచారం తీసుకురావాలి. వాళ్లంతా నిద్ర పోతున్నారు. నువ్వు వారి గదిలోకి వెళ్లగానే వారికి మెలకువ రావచ్చు. అలాంటి స్థితిలో వారికి నిద్రాభంగం కలగకుండా నువ్వు ఆ సమాచారం ఎత్తుకురావాలి. ఆ పరిస్థితుల్లో ఏం చేస్తావ్?" అన్నాడు.

"సార్! నేను నా బూట్లు బైట వదిలి సాక్సులతో లోపలకు వెళతాను. ఆ సాక్సులు ఆ దొంగల ముక్కుల దగ్గర పెడతాను. అంతే వాళ్లకు స్పృహ తప్పిపోతుంది" అన్నాడు అప్పలకొండ.

"మైగాడ్... నీ సాక్సులు అంత పవర్‌ఫుల్లా?" అన్నాడు ఓ కమిటీ సభ్యుడు. "నిజం సార్... కావలిస్తే చూడండి" అంటూ అప్పలకొండ రెప్పపాటు కాలంలో తన సాక్సులు తీసి వారి ముక్కు దగ్గర పెట్టాడు. ఆ ఇంటర్వ్యూ నిర్వహించే సభ్యులిద్దరికీ వెంటనే స్పృహ తప్పింది. మూడో సభ్యుడు అప్పలకొండవైపు భయంగా చూసాడు. 'పాపం.. బలైపోయారు మానవులు. నాకు మాత్రం స్పృహ తప్పలేదు కారణం ఏమిటో?' అనుకుంటూ తన కాళ్లవైపుచూసుకుని 'ఔను... సేమ్ టు సేమ్. తన సాక్సులూ అలాంటివే. అందుకే తనకు రెసిస్టెన్సు వచ్చేసింది' అనుకుంటూ "బాబూ! ఆఖరిగా ఇందిరాగాంధీని చంపిందెవరో తెలుసా?" అన్నాడు.

ఆ మాటలకు సమాధానం చెప్పకుండా అప్పలకొండ బైటకొచ్చాడు. గది బైట అప్పలకొండ కోసం ఎదురు చూస్తున్న రాంపండు అడిగాడు "ఎలా చేసావ్?" అని.

"బాగానే చేసాను. సెలెక్టయ్యాను. ఇందిరాగాంధీ కేసు టేకప్ చేయమన్నారు. ప్రాక్టికల్ పరీక్ష కూడా పెట్టారు. ఇద్దరు సభ్యులకు స్పృహ తప్పించాను" అన్నాడు అప్పలకొండ గర్వంగా.

"అవును... ఇంటర్వ్యూ చేసినవాళ్లూ నీలాంటివాళ్లయి ఉంటారు. అందుకే నిన్ను మామూలుగా బైటకు పంపారు" అన్నాడు రాంపండు.

"అయితే నాకు తెలివితేటలు లేవంటావ్?" అన్నాడు అప్పలకొండ కోపంగా.

"ఒరేయ్... నువ్వు అతిగా తింటావు, అతిగా నిద్రపోతావ్, అలాగే శరీరం కూడా అతిగా పెంచావు. అలాగే నీకు అతి తెలివి ఎక్కువగా ఉంది" అన్నాడు రాంపండు.

"మొత్తానికి నాకు తెలివి ఉందని ఒప్పుకున్నావు?" అన్నాడు నవ్వుతూ అప్పలకొండ.

అప్పలకొండ మాటలకు రాంపండు జుట్టు పీక్కున్నాడు.

★